'పల్లె' వించిన ఓటు చైతన్యం

ఓట్ల పండుగకు ప్రతి పల్లె కదిలింది. ఓటరు నమోదులోనే కాదు.. ఓటు హక్కు వినియోగించుకోవడంలోనూ ఆదర్శంగా నిలిచి ఎన్నికల స్ఫూర్తిని చాటింది. ఈనెల 13న జరిగిన పోలింగ్‌లో కొన్ని గ్రామాల్లో రాత్రి 10 గంటల వరకు బారులు తీరి ఓటేయడం గ్రామీణ ఓటర్ల చైతన్యానికి ప్రతీకగా నిలిచింది.

- ఓటు వినియోగంలో ముందంజలో నిలిచిన గ్రామీణులు
- పట్టణ ప్రాంతాల కన్నా పెరిగిన పోలింగ్
- గ్రామాల్లో గరిష్టం 94.02, కనిష్టం 49.04
- ఓటింగ్‌కు ఆసక్తి చూపిన వృద్ధులు, యువత, రైతులు


వలసపల్లె గ్రామంలో ఓటువేసేందుకు క్యూలైన్లలో వేచియున్న మహిళలు (ఫైల్ ఫోటో)

మదనపల్లె: మదనపల్లె నియోజకవర్గంలో 2,66,590 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 1,30,461, స్త్రీలు 1,36,078, ఇతరులు (థర్డ్ జెండర్) 51 మంది ఉన్నారు. పోలింగ్‌లో మొత్తం 2,00,247 ఓట్లు నమోదు కాగా, ఇందులో పురుషులు 98,471, స్త్రీలు 1,01,755, థర్డ్ జెండర్ 21 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు ఈ సారి ఓటు వేసేందుకు ఆసక్తి చూపగా, మహిళా ఓటర్లు ఓటింగ్‌లో కొంత వెనుకబడ్డారు. మదనపల్లె నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో 2009లో 62.21, 2014లో 69.61, 2019లో 73.44 పోలింగ్ శాతం నమోదు అయింది. తాజాగా 75.11 శాతానికి పెరిగింది. ఇక వృద్ధులు, యువత, మహిళలు బాధ్యతగా ఓటువేయడంతో గత ఎన్నికల్లో కన్నా ఈసారి పోలింగ్ 1.69 శాతం పెరిగినట్లు అంచనా.

పట్టణం డీలా

నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో 80 శాతానికి మించి ఓటుహక్కును వినియోగించుకున్నారు. గ్రామాలతో పోల్చితే పట్టణ ప్రజలు వెనుకబడ్డారు. మదనపల్లె పట్టణంలో 67.54 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం నుంచే పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. దీనికి ప్రధానంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి అర్హత ఆధారంగా సంక్షేమపథకాలు గడప వద్దకే చేరడం, ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం, జగనన్న పాలనపై ప్రతి కుటుంబం సంతృప్తి వ్యక్తం చేయడం, ఎన్నికల సంఘం కల్పించిన అవగాహన కార్యక్రమాలతో చైతన్యం పెరిగినట్లుగా చెప్పుకోవచ్చు. పట్టణాల్లో పోలింగ్ శాతం తగ్గడానికి ప్రజల్లో ఓటు వేయాలన్న చొరవ లేకపోవడం, ఉద్యోగులు, వ్యాపారులు తదితరులు సొంత గ్రామాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడంతో ఓటుకు దూరమయ్యారు. పల్లెల్లో వృద్ధులతో పాటు యువకులు, మహిళలు ఓటుహక్కును వినియోగించుకోవడాన్ని బాధ్యతగా భావించారు. ఇందుకోసం దూరప్రాంతాలు, ఇతర దేశాల నుంచి రావడం గమనార్హం.

రామసముద్రం మండలంలో అత్యధిక పోలింగ్

రామసముద్రం మండలంలోని పోలింగ్ కేంద్రం 241 ఎగువభూంపల్లెలో మొత్తం 686 ఓట్లకు 645 ఓట్లు పోలై 94.02 శాతం నమోదైంది. పోలింగ్ కేంద్రం 249లో 984 ఓట్లకు 644 ఓట్లు పోలై కనిష్ఠం 65.45గా నమోదైంది. నిమ్మనపల్లె మండలంలోని ముష్టూరు పోలింగ్ కేంద్రం. 207లో 998 ఓట్లకు 899 ఓట్లు పోలై 90.08 శాతం గరిష్ఠంగా నమోదైంది. పోలింగ్ కేంద్రం 213 నిమ్మనపల్లెలో 935 ఓట్లకు 720 ఓట్లు పోలై 77.01 శాతం కనిష్ఠంగా నమోదైంది. మదనపల్లె మండలంలో పోలింగ్ కేంద్రం.1 మేకలవాండ్లపల్లెలో 724 ఓట్లకు 663 ఓట్లు పోలై 91.57 శాతం గరిష్ఠంగా నమోదైంది. కురవంక పోలింగ్ కేంద్రం.11లో 926 ఓట్లకు 586 ఓట్లు పోలై 63.28 శాతం కనిష్ఠంగా నమోదైంది. మదనపల్లె పట్టణంలో పోలింగ్ స్టేషన్ నంబర్.167లో 1124 ఓట్లకు 941 ఓట్లు పోలై 83.72 శాతం గరిష్ఠం, పోలింగ్ కేంద్రం.132లో 1,095 ఓట్లకు 537 ఓట్లు పోలై 49.04 శాతం కనిష్ఠంగా నమోదైంది.

కనుమరుగైన 'రైతు రథం'


కొత్తపల్లెలో ఓ రైతు ఇంటి ఎదుట ఎద్దుల బండి

గుర్రంకొండ: దశాబ్దాల క్రితం రైతు జీవితంలో భాగమైన రైతు రథం నేడు కనుమరుగైంది. ఆరోజుల్లో కాడెద్దు బండీ ఉంటనే రైతుగా గుర్తింపు ఉండేది. పెద్ద చక్రాలతో పైన ఇనుప కమ్మి రక్షణ కవచంగా అప్పట్లో బండ్ల నిర్మాణం జరిగేది. బండి ఇరుసు ముందు భాగంలో కాడిమాను ఏర్పాటు చేసి కాడిమానుకు చెరోవైపు రెండు ఎద్దులను కట్టి బండి మీద రైతుసవారీ చేస్తుంటే ఆదృశ్యాలు కనువిందు చేసేవి. పల్లెల్లో ఎక్కడ చూసిన ఏ ఇంటికి వెళినా కచ్చితంగా రైతు రథమైన ఎద్దుల బండీ ఉండేది. నేటి ఆధునిక యుగ నాగరికతలోఆ ఎద్దులబండీ స్థానంలో టైర్ల బండి వచ్చింది. పెద చక్రాల బండ్లు ఇళ్లలో మూలనపడ్డాయి. చిన్నచిన్న టైర్ల బండ్లు అందులోనూ ఒకే ఎద్దులాగే విధంగా నేటి ఎద్దుల బండ్లు తయారయ్యాయి. ఎన్నో వందల సంవత్సరాలనుంచి రైతుల జీవితాలతో పెనవేసుకుపోయిన నాటితరం ఎద్దులబండ్లు నేడు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్టాండు


జలమయమైన ఆర్టీసీ బస్టాండు

పీలేరు రూరల్: పీలేరులో గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ఆర్టీసీ బస్టాండు జలమయమైంది. బస్టాండులో ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు ఒకసారిగా బస్టాండులోకి చేరుకోవడంతో బస్టాండులోని దుకాణాల వర్షపు నీరు నిలిచింది. బస్టాండు జలమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ అధికారులు వర్షపు నీరు బస్టాండులోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. 24.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ మహబూబ్‌బాషా తెలిపారు. ఎల్‌బీఎస్ రోడ్డు వర్షపు నీరు ప్రవహించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

19న సత్యనారాయస్వామి కల్యాణోత్సవం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణ సమీపంలోని చిప్పిలిలో వెలసిన చిట్టి అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో 19న స్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షులు కె.అమరనాథ్, కార్యదర్శి వైద్యం రామకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక ఆలయంలో కల్యాణోత్సవ ఆహ్వానపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం స్వామి కల్యాణం మండపంలో వేద పండితుల ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన సంతర్పణ జరుగుతుందన్నారు. భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


ప్రత్యేక అలంకరణలో శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మొదటి రోజు ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మూలవర్లకు ఉత్సవ విగ్రహములకు తిరుమంజన సేవ నిర్వహించారు. సాయంత్రం విశ్వక్సేనుడు ఆరాధన చేశారు. అంకుర్పారణ చేసి అర్చకులు, వేదపండితులు, కమిటీ సభ్యులు రక్షాబంధనం కంకణాలు ధరించారు. బ్రహోత్సవాలకు ఆహ్వానం పలుకుతూ విశ్వక్సేనుడు ఆహ్వానం పలికారు. శుక్రవారం నుంచి ఉత్సవాల్లో భాగంగా స్వామి వాహనాల్లో భక్తులకు దర్శనం కల్పిస్తారు.

దత్తాత్రేయునికి అభిషేకం

పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్శ్వేర స్వామి ఆలయంలో గురువారం దత్తాత్రేయునికి అభిషేకాలు నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో దత్తాత్రేయునికి ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. కర్నాటకకు చెందిన వేద పండితులు శేషాచలం, వేణుగోపాల శర్మ, సత్యనారాయణ శర్మ, నటరాజ శర్మలు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

నాగదేవతల ఆరాధన

మదనపల్లె సిటీ: శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి 331 ఆరాధన మహోత్సవాల్లో భాగంగా స్థానిక కదిరిరోడ్డులో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం ఉదయం సుప్రభాతసేవ, నాగదేవతల ఆరాధన నిర్వహించారు. పంచామృతాభిషేకం, హోమాలు చేశారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు లక్ష్మీనారాయణాచారి, భాస్కరాచారి,ఆలయ అర్చకులు వీరబ్రహ్మాచార్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

పీలేరు రూరల్: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నరసింహుడు హెచ్చరించారు. గురువారం మండలంలోని తలపుల, మేళ్లచెరువు, రెడ్డివారిపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జూన్ 4 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉందని గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే ఉపేక్షించేదేలేదని హెచ్చరించారు. అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


సర్పంచు శ్యామలమ్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు సర్పంచు శ్యామలమ్మ అనారోగ్యంతో బెంగళూరు మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటోంది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఆయన సతీమణి కవితమ్మ గురువారం ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆమె కుమారులు రామకృష్ణారెడ్డి, రవిశంకర్‌రెడ్డిలతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించేలా వైద్యులను కోరారు. వారి వెంట నల్లగండ్ల మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

శ్రీ మద్దెమ్మ ఆలయానికి విరాళం


విరాళాన్ని నిర్వాహకులకు అందజేస్తున్న దాతలు

ములకలచెరువు: మండలంలోని చౌడసముద్రం సమీపంలో వెలసిన శ్రీ మద్దెమ్మ ఆలయ అభివృద్ధి కోసం కర్ణాటక రాష్ట్రం రాగుట్టహళ్లికి చెందిన శ్రీరామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి లలితమ్మ, కుమారులు హర్ష, రాయల్ గురువారం రూ. లక్ష విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ ధర్మకర్త వెంకటరెడ్డి, నిర్వాహకులు పుట్టా శేఖర్‌గుప్తాకు అందజేశారు. గతంలో కూడా ఆలయ అభివృద్ధి కోసం వీరు నగదు అందజేశారు.

గంగమ్మ జాతర చాటింపు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలో అత్యంత వైభవంగా జరిగే కోర్టులో గంగమ్మజాతర చాటింపు గురువారం జరిగింది. ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఎనుపోతుకు పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మార్పురి చిన్నరెడ్డప్ప, కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ ఈ నెల 28న రాత్రి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. రాత్రి నుంచి అమ్మవారు భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. 29న పగలు తిరుణాల అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని కోరారు. వేణుగోపాల్, రంగస్వామి, కరుణాకర్, మహేష్ పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం

కలకడ : క్షయ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిజ్ఞ క్కరూ పని చేయాలని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ జవహర్‌బాబు కోరారు. బీసీజీ వ్యాక్సిన్ పెద్దలకు తప్పకుండా అందించాలని సూచించారు. గురువారం మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో 70 మందిని టార్గెట్‌గా ఎంపిక చేసి అడల్ట్ టీబీ వ్యాక్సినేషన్ అందిస్తామని తెలిపారు. ఎలాంటి అపోహలకు గురి కావద్దని సూచించారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ అందించినట్లు తెలిపారు. సిబ్బంది టీబీ కేసులను క్షుణ్ణంగా పరిశీలించి పర్యవేక్షణలో ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మ, సీహెచ్‌ఓలు సులోచన, లావణ్య, సిబ్బంది భారతమ్మ పాల్గొన్నారు.

సమష్టిగా క్షయ వ్యాధిని నివారిద్దాం

పెద్దమండ్యం: సమష్టిగా క్షయ వ్యాధిని నివారిద్దామని సీహెచ్‌ఓ కృష్ణయ్య పిలుపునిచ్చారు. మండలంలోని సీ గొల్లపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని రెక్కలకొండపల్లెలో గురువారం క్షయ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజనులు, టీబీ వ్యాధి మందులు వాడి తగ్గిన వారికి, వారి కుటుంబసభ్యులకు, ధూమపానం చేసేవారికి క్షయ టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. ఆరు వారాల పాటు ప్రతి గురువారం ఈ టీకాలు గ్రామాలలో వేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఆయా గ్రామ సచివాలయ పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు క్షయ టీకాలు వేస్తారని తెలిపారు. వయోజనులకు క్షయ దగ్గు రాకుండా నివారించేందుకు ప్రభుత్వం టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇమ్మాన్యుల్, ఆరోగ్య సిబ్బమది పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోండి

పీలేరు : బీసీజీ వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎతలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి కోరారు. గురువారం డల్ట్ టీబీ వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్ పెద్దలకు తప్పకుండా అందించాలని సూచించారు. గురువారం మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో 70 మందిని టార్గెట్‌గా ఎంపిక చేసి అడల్ట్ టీబీ వ్యాక్సినేషన్ అందిస్తామని తెలిపారు. ఎలాంటి అపోహలకు గురి కావద్దని సూచించారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ నివారణ

మదనపల్లె : క్షయ వ్యాధి నివారణలో బీసీజీ వ్యాక్సిన్ సమర్థవంతంగా పనిచేస్తుందని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ లక్ష్మి అన్నారు. గురువారం పట్టణంలోని రామారావుకాలనీ వైఎస్సార్ అర్బన్‌హెల్త్ క్లినిక్‌లో బీసీజీ టీకా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నమయ్యజిల్లాను బీసీజీ టీకా పంపిణీకి పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఆరోగ్య కార్యకర్తల ద్వారా సర్వే నిర్వహించి ప్రత్యేక కేటగిరీ వారిని గుర్తించామన్నారు. వారందరికీ బీసీజీ టీకా ఎలా ఇవ్వాలి. ఏ విధంగా, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు. 18 ఏళ్లు పైబడిన వారిలో టీబీ రోగుల కుటుంబసభ్యులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం చేసేవారికి, 60 ఏళ్లు పైబడిన వారందరికీ టీకా వేస్తామని పేర్కొన్నారు. బీసీజీ వ్యాక్సిన్‌తో ఎలాంటి నష్టం కలగదని, ఎటువంటి దుష్పరిణామాలు సంభవించవన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్.విష్ణువర్ధన్‌రెడ్డి, టీబీ యూనిట్ సిబ్బంది ప్రభాకర్, సునీల, వనజకుమారి, తరుణ్, సునీత, ఆరోగ్యకార్యకర్తలు సరితా, సోని, ఆశాకార్యకర్తలు, 104 నోడల్ ఆఫీసర్ ప్రవీణ్, కమర్ వల్లి పాల్గొన్నారు.


రెక్కలకొండపల్లెలో క్షయ టీకా వేస్తున్న దృశ్యం

క్షయవ్యాధి నివారణకే బీసీజీ

తంబళ్లపల్లె: క్షయవ్యాధిని నివారించేందుకే మండలంలో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కోసువారిపల్లె పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అనుపమ, డాక్టర్ మునికుమార్ తెలిపారు. గురువారం మండలంలోని 12 విలేజ్ క్లీనిక్‌లలో కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. స్థానిక వైద్యవిధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ తేజశ్వి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 5 ఏళ్లలో టీబీ వ్యాధి భారినపడి, 18 ఏళ్లు నిండినవారు, షుగర్ వ్యాధి ఉన్న వారికి ఈ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. 270 మందికి వ్యాక్సిన్ ఇచ్చినట్లు వైద్యులు తెలిపారు. టీబీ మందులు వాడుతున్న వారు, గర్భవతులు, పాలు ఇచ్చే తల్లులు, హెచ్ఐవీ బాధితులు, జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడేవారు. కిడ్నీ, లీవర్‌మార్పిడి చేసుకుని మందులు వాడుతున్న వారు, రక్తదానం చేసి 3 నెలల వారికి వ్యాక్సిన్ వేయవద్దని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీజీ టీకాను సద్వినియోగం చేసుకోండి


బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న ఏఎన్ఎం

వాల్మీకిపురం: మండల వ్యాప్తంగా వయోజనులకు బీసీజీ టీకాలను ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో వేస్తామని టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బీసీజీ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గురువారం 18 ఏళ్లు దాటిన వారిని గుర్తించి వారికి, మధుమేహవ్యాధి గ్రస్తులకు, ధూమపానం చేసేవారికి, టీబీ మందులు వాడి తగ్గిన వారికి, టీబీ వ్యాధి కుటుంబ సభ్యులకు, 60 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా బీసీజీ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. వైద్య సిబ్బంది మురళి, నాగిరెడ్డి, క్రిష్ణమూర్తి, అమృత, సరోజ, స్వరూప, అమరావతి, రామాంజులు పాల్గొన్నారు.

ఏమిచ్చినా మీ రుణం తీర్చుకోలేం


చింతల రామచంద్రారెడ్డిని కలిసిన నాయికులు

కలకడ : ఏమిచ్చినా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానుల రుణం తీర్చుకోలేమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే విజయం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. గురువారం మండలంలోని కోన పంచాయతీకి చెందిన పలువురు అభిమానులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మండల ప్రత్యేక ఆహ్వానితురాలు సరళ, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూధన్‌రెడ్డి, మున్న, ఎంపీ బాషాఖాన్, వెంకటేశ్వర, శశి, కత్తి రమణ, శివారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శంకర, గోవర్ధన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల కోసమే పికెటింగ్

వాల్మీకిపురం: సమస్యాత్మక గ్రామాల్లో శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకొని పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మండలంలోని చింతపర్తిలో పికెట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమస్యాత్మక గ్రామాల్లో పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో శాంతియుతంగా ఉండాలని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ నివారణ



గర్నిమిట్టలో డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

కేవీపల్లి: ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ నివారణ సాధ్యమవుతుందని గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి అర్చన అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గర్నిమిట్టలో వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు నీటిలో ఉత్పత్తి చెంది డెంగ్యూను వ్యాప్తి చేస్తాయని, ప్రజలు నివాస పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలని సూచించారు. ప్రధానంగా డెంగ్యూ దోమ పగటి పూట కుడుతుందని, శరీరం కప్పి ఉండేలా వస్త్రదారణ ఉండాలన్నారు. డెంగ్యూ జ్వరం ప్రమాదకరమైనందున లక్షణాలు తెలిసిన వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మి, రమాదేవి, హెచ్ఎస్ రుక్మిణి, పురుషోత్తం, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమిష్టికృషితో డెంగ్యూ నివారణ

పీలేరు: ప్రజల సమష్టి కృషితోనే డెంగ్యూ వాధి నివారణ సాధ్యమని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా పీలేరు పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి విద్యాసాగర్, సీహెచ్‌ఓ విజయలక్ష్మి, హెల్త్‌ఎడ్యుకేటర్ ఉషరాణి, సిబ్బంది కొండయ్య, శ్రీనివాసులు, చిన్నయ్య, కుసుమ పాల్గొన్నారు.

ప్రజల తోడ్పాటుతో డెంగ్యూ నివారణ

కలకడ : ప్రజల తోడ్పాటుతో డెంగ్యూ వాధి నివారణ సాధ్యమని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని పాపిరెడ్డిగారిపల్లెలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ర్యాలీలో వేపాకు పాగ–దోమలకు సెగ, చిన్న ప్రాణులు–పెద్దప్రమాదం, దోమపుట్టరాదు–దోమకుట్టరాదు, నెట్‌కట్టు–దోమపట్ అనే నిదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జవహర్ బాబు, హెపీహెచ్‌ఈఓ జయరామయ్య , సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మ, సీహెచ్‌ఓలు సులోచన, లావణ్య, సిబ్బంది మహమ్మద్‌షరీఫ్, వాణి, వరలక్ష్మి, భాగ్యమ్మ, లక్ష్మిదేవి, శ్రీలక్ష్మి, సునీత, అలివేలు పాల్గొన్నారు.


వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పెద్దతిప్పసముద్రం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పురుషోత్తం నాయక్, కందుకూరు పీహెచ్‌సీ డాక్టర్లు శంకర్, అభిలాష్ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. జ్వరాలు ఎలా ప్రబలుతాయి, వాటి నివారణ చర్యలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

వాల్మీకిపురం: మన చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాల్లో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీవిద్య అన్నారు. గురువారం చింతపర్తి పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహించి, డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుధాకర్, మహమ్మద్ రఫీ, ముజీబ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో గెలుపు ధీమా

- జగనన్న అందించిన సంక్షేమ పథకాలే గెలుపునకు దోహదం
- మదనపల్లెలో హ్యాట్రిక్ దిశగావైస్సార్ సీపీ


మదనపల్లె పట్టణం ఏరియల్ వ్యూ

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. ఈవీఎంలలో ఓటరు తీర్పు నిక్షిప్తమై ఉంది. జూన్ 4న ప్రజాతీర్పు వెల్లడి కానుంది. వైఎస్సార్‌సీపీ శిబిరంలో గెలుపు ధీమా కనిపిస్తోంది. ఎవరికి వారే గెలుపుపై అంచనాలు వేసుకుంటున్న తరుణంలో పెరిగిన పోలింగ్ శాతం తమకు అనుకూలమని వైఎస్సార్‌సీపీ శ్రేణులు భావిస్తున్నాయి. గతంలో కన్నా ఈసారి పోలింగ్ శాతం పెరగడం అనుకూల అంశంగా అంచనా వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు పెద్దసంఖ్యలో ఓటింగ్‌కు తరలిరావడం వైఎస్సార్‌సీపీ గెలుపుకు దోహదపడే అంశం.జగనన్న ప్రభుత్వంలో అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, విద్యాదీవెన, వసతిదీవెన, సున్నావడ్డీ రుణాలు తదితర పథకాల లబ్ధిని నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేయడం, జగనన్న పేదలందరికీ ఇళ్లు, టిడ్కో ఇళ్లు పథకంలో మహిళల పేరుమీదే లక్షల విలువ చేసే ఆస్తిని అందించడంతో మహిళలు వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తేనే తమకు మరింత మెరుగైన సంక్షేమం అందుతుందని భావించి పెద్దసంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొని వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపారు. 2019 ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోలోని హామీలన్నింటినీ 99 శాతానికి పైగా నెరవేర్చి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నిలుపుకోవడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచింది. దీనికితోడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రతి కుటుంబానికి మంచి జరిగి ఉంటేనే మీ బిడ్డను ఆశీర్వదించండని చెప్పడం, పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధంలో జగన్ పేదలపక్షాన ఉన్నానని, తన పథకాలకు పేదలే స్టార్ క్యాంపెయినర్లని చెప్పడం ప్రజల్లో బాగా చొచ్చుకెళ్లింది. 2024 వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో అమ్మ ఒడి రూ.15 వేల నుంచి రూ.17 వేలకు పెంపు, రెండు విడతల్లో పెన్షన్ రూ.3,500కు పెంపు, వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా కొనసాగింపు, చేయూత రూ.75 వేల నుంచి రూ.1.50 లక్షలకు పెంపు, కాపునేస్తం రూ.60వేల నుంచి రూ.1.20లక్షలకు పెంపు, ఈబీసీ నేస్తం రూ.45వేల నుంచి రూ.1.05లక్షలకు పెంపు, వైఎస్సార్ సున్నావడ్డీ రుణాలు రూ.3లక్షలకు పెంచుతామని చెప్పడం, జగనన్న మాట ఇస్తే, ఇబ్బందులు ఎదురైనా తప్పక నెరవేరుస్తాడనే నమ్మకం అందరిలో ఉండటంతో వైఎస్సార్ సీపీకి అండగా నిలిచారు.

అభివృద్ధి పనులే కీలకం

కూటమి పేరుతో 2014లో ప్రకటించిన మేనిఫెస్టోలని 600 హామీలను ఒక్కటీ నెరవేర్చకపోగా, 2024లో ఆచరణ సాధ్యం కాని హామీలతో తిరిగి అవే పార్టీలు ఒక్కటై ఎన్నికల బరిలోకి రావడంతో ప్రజలు ఆయా పార్టీల నాయకుల హామీలను విశ్వసించ లేదు. రైతుల విషయానికి వస్తే వైఎస్సార్ రైతు భరోసాలో భాగంగా రైతు కుటుంబానికి అందిస్తున్న పెట్టుబడి సాయం ఏటా రూ.13,500 నుంచి రూ.16వేలకు పెంపు.. మరింతంగా ప్రభావం చూపిందని విశ్లేషకులు భావిస్తున్నారు. పట్టణంలో కీలకమైన సంఖ్యాబలం కలిగిన మైనారిటీ సామాజిక వర్గం నుంచి విద్యావంతుడు, మాజీ ప్రభుత్వ ఉద్యోగి అయిన నిసార్‌అహ్మద్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేయడం, రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి నియోజకవర్గంలో మంచి పట్టు, క్యాడర్ ఉండటం, పదేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉండటం, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మదనపల్లె నియోజకవర్గంలో మెడికల్ కళాశాల, బీటీ కళాశాలను ప్రభుత్వపరం, యూనివర్శిటీగా మార్పు, మదనపల్లె–తిరుపతి ఫోర్‌లేన్, అనంతపురం రహదారి విస్తరణ, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు తదితర అనేక అభివృద్ధి పనులు జరిగాయి. మొదట్నుంచీ వైఎస్సార్ సీపీకి పెట్టని కోటగా ఉన్న మదనపల్లె నియోజకవర్గంలోని మూడు మండలాల్లో పటిష్టమైన క్యాడర్, సమర్థవంతమైన నాయకత్వం ఉంది. దీనికితోడు గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా పోలింగ్ జరగడంతో ఈ క్రమంలో మహిళలు, రైతుల నుంచి పెద్ద ఎత్తున ఓట్లు పోలవ్వడంతో మూడోసారి మళ్లీమదనపల్లె గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడుతుందని ఆ పార్టీ శ్రేణులు ఆశాభావంతో ఉన్నారు.